క్లుప్తంగా

వర్షంతో రహదారులు జలమయం



రేపల్లె: పట్టణంలో బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, మున్సిపల్ ఆఫీసు రోడ్డు, నిజాంపట్నం రోడ్లతోపాటు పలు రహదారులు, పల్లపు ప్రాంతాలలో వర్షపు నీరు నిలబడింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

ఉపాధి నిధులతో సిమెంట్ రోడ్లు



వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి పథకం నిధులు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేయడం జరుగుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. నియోజక వర్గంలో బుధవారం సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. చుండూరు మండలంలో మండూరు, చినపరిమి, అమర్తలూరు మండలంలో పెదపూడి, వేమూరు మండలంలోని పెరవలి, పెరవలి పాలెం గ్రామాల్లో ఆయన రోడ్లు ప్రారంభించారు. మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, గొట్టిపాటి భానుగంగాధర్, చుండూరు, అమర్తలూరు ఎంపీడీఓలు సుదీప్, మారుతీ శేషాంబ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ నిర్మాణానికి శంకుస్థాపన

తాడేపల్లి రూరల్: పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ పాఠశాలలోని బీసీ హాస్టల్‌ను కొత్తగా నిర్మించేందుకు మంత్రి నారా లోకేష్ చొరవ చూపారు. దీంతో రాడికో ఖైతాన్ లిమిటెడ్ సంస్థ ముందుకు రావడంతో పాత బిల్డింగ్‌ను తొలగించి కొత్త బిల్డింగ్ నిర్మాణానికి బుధవారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీ మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లిపల్లి శ్రీనివాసరావు, టీడీపీ మండల ఉపాధ్యక్షులు కొల్లి శేషు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో తాడేపల్లి పార్టీ పరిశీలకులు సత్యనారాయణ, పెనుమాక, ఉండవల్లి కూటమి నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలి



తెనాలిటౌన్: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 24వ వార్డు కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య పిలుపునిచ్చారు. పట్టణ శాంతినగర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయడం వలన కలిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ వెంకట రమణ, సచివాలయ మహిళా పోలీసు జ్యోత్స్న శ్రీ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం

తెనాలిరూరల్: అస్సాంకు చెందిన బాలుడు అదృశ్యమవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అస్సాంకు చెందిన ఓ కుటుంబం ఇటుక పనుల నిమిత్తం తెనాలి సుల్తానాబాద్‌కు వచ్చి ఉంటున్నారు. వీరి కుటుంబంలోని 13 ఏళ్ల బాలుడు గౌలా మే 27 నుంచి కనబడకుండా పోయాడు. గాలించినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు.

సీసీ రోడ్ల ప్రారంభోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడేలా సిమెంటు రోడ్ల నిర్మాణం చేసినట్లు ఎమ్మెల్యే టి.శ్రావణ్‌కుమార్ అన్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు సుమారు రూ.75 లక్షల వ్యయంతో కండ్రిక, ఫిరంగిపురం, వేములూరిపాడు గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండవ నరసింహారావు, కె.రామకోటేశ్వరరావు, వై.ప్రకాష్, అప్పయ్య, ఎన్.రవి, బి.సతీష్, కె.శేషు, నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా.. పట్టదా వ్యథ!

- రేపల్లె పట్టణంలో తాగునీటి పైపులైన్లకు లీకులు
- లీకులను నివారించడంలో అధికారులు విఫలం
- సంవత్సరకాలంగా పట్టించుకోని వైనం
- లీకులతో మంచినీటితో కలుస్తున్న మురుగునీరు
- శివారు ప్రాంతాలకు అందని తాగునీరు



ప్రభుత్వ వైద్యశాల సమీపంలో సంవత్సర కాలంగా వృథాగా పోతున్న తాగునీరు

రేపల్లె: మున్సిపాలిటీ పైపులైన్లకు ఏర్పడుతున్న లీకులతో వేల లీటర్ల తాగునీరు నిత్యం వృథాగా పోతుంది. రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచినా లీకేజీలను అరికట్టడంలో అధికారులు విఫలం చెందుతున్నారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల నుంచి పెద్ద మసీదు వరకు మూడు ప్రాంతాలలో సంవత్సరం క్రితం ఏర్పడిన లీకేజీల ద్వారా వేల లీటర్ల తాగునీరు వృథాగా మురుగు కాల్వల పాలవుతోంది. ప్రభుత్వ వైద్యశాల సమీపంలో, పద్మశాలీయ కల్యాణ మండపం సమీపంలో రెండు చోట్ల ప్రధాన రహదారి పక్కనే సంవత్సరం క్రితం పైపులైన్‌లకు లీకులు ఏర్పడి పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. లీకులు ఏర్పడి సంవత్సరం గడుస్తున్నా నివారించటంలో అధికారులు విఫలం చెందుతున్నారని పట్టణ ప్రజలు, ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. పైపులైన్లకు లీకులు ఉండడంతో స్థానికంగా ఉండే మురుగుకాల్వలోని నీరు లీకుల ద్వారా మంచినీటిలో కలిసి కొళాయిలకు సరఫరా అవుతున్నాయి. ఆ నీటిని తాగిన ప్రజలు జబ్బున పడుతున్న దుస్థితి నెలకొంది.



పద్మశాలీయ కల్యాణ మండపం సమీపంలో..



పద్మశాలీయ కల్యాణ మండపం ఎదురు దుస్థితి

లీకేజీలు ఏర్పడుతున్న ప్రాంతాలు

పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ పైపులైన్లకు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా పెద్ద మసీదు, కూరగాయల మార్కెట్, రింగ్ రోడ్ సెంటర్, తాలూకా, ఇండియన్ బ్యాంక్ రోడ్డులలో నిత్యం పైపులకు లీకులు ఏర్పడటం పరిపాటిగా మారింది. దీంతో పాటుగా పద్మశాలీయ కల్యాణ మండపం ఎదురు విద్యుత్ స్తంభం సమీపంలో ఏర్పడిన లీకేజీ గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులకు నోచుకోలేదు. అదేవిధంగా పెద్దకూరగాయల మార్కెట్ వెనకవైపు గత కొన్ని నెలల క్రితం ఏర్పడిన లీకేజీని అరికట్టడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో వేల లీటర్ల తాగునీరు వృథాగా పోతోంది. పలుచోట్ల తాగునీరు మురుగు కాల్వలలో కలుస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో తాగునీరు రహదారులపైకి చేరటంతో ఆ ప్రాంతాలు జలమయంగా మారుతున్నాయి.

శివారు ప్రాంతాలకు అందని నీరు

పైప్‌లైన్లకు ఏర్పడుతున్న లీకుల కారణంగా పట్టణంలోని శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో మున్సిపాలిటీ తాగునీరు సరఫరాగాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 1, 28, 22, 23, 24, 25, 26 వార్డులకు పూర్తిస్థాయిలో నీరు సరఫరా కావడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ 1, 28 వార్డులలో ప్రజలకు మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సమస్యను పరిష్కరిస్తాం

పట్టణంలో 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైపులైన్‌లు కావటంతో లీకేజీల సమస్య వేధిస్తోంది. ప్రభుత్వ వైద్యశాల నుంచి పెద మసీదు వరకు సంవత్సరం క్రితం ఏర్పడిన లీకులను సరిచేస్తున్నా సమస్య మరలా ఉత్పన్నమవుతోంది. ఆయా ప్రాంతాలలో మెయిన్ పైప్‌లైన్‌లు తీవ్రంగా దెబ్బతింది. పాత పైప్‌లైన్‌లను తొలగించి కొత్తది ఏర్పాటు చేసేందుకు రూ.40లక్షలతో టెండర్లు పిలవటం జరిగింది. త్వరలో సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం.

– మధుసూధనరావు, మున్సిపల్ డీఈ, రేపల్లె

వేతనాలు పెంచకుంటే నిరవధిక సమ్మె

రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల నిరసన



కమిషనర్ సాంబశివరావుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రేపల్లె: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలియజేసి కమిషనర్ కె.సాంబశివరావుకు సమ్మె నోటీసు అందజేశారు. మణిలాల్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నెంబర్ 36 ప్రకారం రూ.24,500 జీతాలు పెంచి చెల్లించాలన్నారు. మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్సీ జీతాలు, కరువుభత్యం, ఐఆర్, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. 2018 నాటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రాతపూర్వక ఒప్పందంలో సమానపనికి, సమానవేతనం 2019 జనవరి నుంచి అమలు చేస్తామన్న ఒప్పందాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల జీతాలు పెంపుదల చేయడంతో పాటు ఇతర డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు. రేపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎస్.రవి, కోశాధికారి కె.రాఘవేంద్రరావు, యువరాజు, శివ, బీటెక్ రవి, గీత, ఎస్.అనూష, సుధాకర్, వాసు, ఎం.బాబు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం



యువకుడికి నగదు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

- తల్లిని కోల్పోయి ఒంటరియైన చీరాల యువకుడికి జిల్లా కలెక్టర్ భరోసా
- డీఆర్డీఏ ఆధ్వర్యంలో రూ.50వేలు ఆర్థికసాయం అందజేత

బాపట్ల: బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పముజుల వెంకటశిరీష గ్రామ సమాఖ్య సహాయకురాలుగా పని చేస్తూ జీవనం సాగించేంది. భర్త ఒంటరిగా వదిలేయడంతో కుమారుడే లోకమని భావించి అతని కోసం కొన్నేళ్లుగా ఒంటరి జీవితం కొనసాగిస్తోంది. తాను కష్టపడుతూ వచ్చిన అరాకొర జీతంతోనే ఇల్లు చూసుకుంటూ, కుమారుడిని బీటెక్‌లో జాయిన్ చేయించింది. అయితే ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో కుమారుడు పవన్ ఒంటరిగా మిగిలిపోయాడు. పవన్ బాపట్లలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశించిన తన తల్లి కల కలగానే ఉండిపోతుందని భయపడ్డాడు. అలాంటి సమయంలో పవన్‌కు డీఆర్డీఏ బాసటగా నిలిచింది. పవన్ ఉన్నత చదువులకోసం చేయూతనందించాలని నిర్ణయించింది. వెనువెంటనే పీ4 కింద దత్తత తీసుకుంది. చీరాలకు చెందిన గ్రామ సమాఖ్య సభ్యులంతా కలిసి అతనికి తమ వంతు సహాయంగా రూ.50 వేలను జిల్లా కలెక్టర్ వెంకటమురళి ద్వారా అందజేశారు.

యువకుడికి కలెక్టర్ భరోసా

పవన్ గురించి తెలుసుకున్న కలెక్టర్ స్పందించారు. ఎప్పుడైనా, ఎటువంటి కష్టం వచ్చినా తనను కలవవచ్చని కలెక్టర్ వెంకటమురళి భరోసా ఇచ్చారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా యువకుడిని డీఆర్డీఏ దత్తత తీసుకోవడంపై డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావును, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి



పాతబస్టాండ్‌లో ధర్నాచేస్తున్న సీఐటీయూ నాయకులు

బాపట్లటౌన్: విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఐదువేల మందిని తొలగించడానికి నిరసనగా సీఐటీయూ బాపట్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పాత బస్టాండ్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. కె ధనలక్ష్మి మాట్లాడుతూ అనేకమంది ప్రాణత్యాగాల ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నేడు కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలన్న కుట్రలో భాగంగా కార్మికుల్ని తొలగించడం దుర్మార్గమన్నారు. కనీసం కార్మికులతో చర్చ జరపకుండా కార్మికులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా తొలగించటం దారుణమన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడతామని ఎన్నికల సమయంలో భరోసా ఇచ్చి, నేడు అయిదు వేల మందికి ఉద్యోగాలు కోల్పోతున్న ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం శోచనీయం అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్ మనిలాల్, సిహెచ్ మజుందార్, నాయకులు ఎం.వసంతరావు, కె.శ్రీనివాస్, టి.వెంకటేశ్వర్లు, ఝాన్సీ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కమిషనర్ బండి శేషన్న సేవలు అభినందనీయం



కమిషనర్ బండి శేషన్నను సత్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, ఇతర అధికారులు

తెనాలిటౌన్: నంద్యాల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయిన తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో బుధవారం కమిషనర్ బండి శేషన్నకు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొని ఆయనను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి మెమోంటో బహుకరించారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన 18 నెలల కాలంలో బండి శేషన్న మంచితనం పరిపాలన దక్షత అభినందనీయమని కొనియాడారు. కమిషనర్ శేషన్న మాట్లాడుతూ తెనాలి కమిషనర్‌గా పనిచేయడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని ఇక్కడి ప్రజల ఆదరణ, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం మరువరానిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.వి. గోపాలకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ వీఎం.లక్ష్మీపతిరావు, వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, ఆర్‌వో రాంప్రసాద్, ఇన్‌ఛార్జ్ ఎంఈ ఆకుల శ్రీనివాసరావు, ఏసీపీలు వాణి, శివన్నారాయణ, వివిధ శాఖల అధికారులు, పలువురు కౌన్సిలర్‌లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు



పూజల్లో పాల్గొన్న రైతులు

కొల్లిపర: ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని వల్లభాపురం గ్రామంలో శ్రీ వినాయక స్వామి దేవస్థానంలో బుధవారం ఎద్దుల ద్వారా వ్యవసాయం రైతులతో ఘనంగా ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు నిర్వహించి నాగలి ఎద్దులకు వేదోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ 103 సంవత్సరాలు క్రితం దేవాలయం నిర్మించబడిందని ఆనాటి నుండి ప్రతి సంవత్సరము ఏరువాక పౌర్ణమి ఉత్సవాలు దేవాలయంలో క్రమం తప్పకుండా రైతుల సహకారంతో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు చేయటం వలన గ్రామంలో రైతులు సుభిక్షంగా ఉండాలని పాడిపంటలు బాగా పండుతాయి అని నమ్మకంతో పూజలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు లో గ్రామంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. పూజా కార్యక్రమాలు అనంతరం గ్రామంలో ఎద్దులు ద్వారా వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వంగ వీరారెడ్డి, మందాల సంగిరెడ్డి, ఏమినేని వెంకట నాగేశ్వరరావు, జి. బసివిరెడ్డి, తాడిబోయిన శివయ్య, దేశ బోయిన స్వరయ్య, పామర్తి వెంకటేశ్వరరావు, ఏమినేని పానకాలు, అర్చకులు నందివెలుగు సాయి వెంకటరామయ్య, కొండ బుల్లిరెడ్డి, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

వైకుంఠాధిపతికి గరుడ సేవ



పురవీధుల్లో స్వామివారి గరుడ సేవ

తెనాలిటౌన్: వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం స్థానిక వైకుంఠపురం శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం నందు స్వామివార్లకు గరుడ సేవ కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి దేవస్థానంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరహాల్లో శ్రీ స్వామి అమ్మవార్లకు పట్టణంలో గరుడ సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండి రైతులంతా సమృద్ధిగా ఉండాలని ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశంగా తెలిపారు. ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఏపీ ప్రజా నాటక కళాపరిషత్ కార్యాలయం ప్రారంభం



తాడేపల్లి రూరల్: ప్రాతూరులోని ఆంధ్రప్రదేశ్ నాటక కళాపరిషత్ నూతన కార్యాలయాన్ని ఏపీ నాటక కళా పరిషత్ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ కార్యాలయాన్ని ప్రాతూరులో ఏర్పాటు చేయడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ప్రాతూరులో ఆఫీసును ఏర్పాటు చేసిన శ్రీనివాస్, ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కళాకారులందరినీ కలుపుకొని పనిచేస్తూ నాటక కళను అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ ప్రాతూరు గ్రామ పార్టీ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాస్, కె.ప్రసాదు, పి.నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, సాంబశివరావు, హరిబాబు, నరసింహారావు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి విద్యార్థులకు ఆర్టీసీ పాసులు

మంగళగిరి టౌన్: విద్యార్థులకు ఈనెల 14వ తేదీ నుంచి బస్‌పాస్‌లు ఇవ్వనున్నట్లు మంగళగిరి ఆర్టీసీ డిపో మేనేజర్ రెంటపళ్ల పిచ్చయ్య బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బస్‌పాస్ తీసుకునే వారు ముందుగా వారి వివరాలను ఏపీ ఎస్‌ఆర్‌టీసీ బస్‌పాస్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. 12, 13వ తేదీల్లో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ జరుగుతుందని.. దీంతో బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్ పనిచేయదని.. బస్‌పాస్ కావాల్సిన విద్యార్థులు 14వ తేదీ నుంచి బస్‌పాస్ కౌంటర్‌కు రావాలని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని చినకాకాని జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం ఇద్దరు యువకులు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై వెళుతూ ఢీకొన్నారు. ఈ ఘటనలో విజయవాడకు చెందిన రాజేష్, పెదకాకానికి చెందిన వెంకట్రావులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. గమనించిన స్థానికులు ఇరువురినీ దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం తరలించారు.

ఆటో ఢీకొనీ ఒకరికి..

దుగ్గిరాల: బైక్ ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. దుగ్గిరాల లాకుల సమీపంలో రేపల్లె వెళుతున్న ఎ.మాణిక్యరావును ట్రక్ ఆటో బుధవారం ఢీకొంది. దీంతో ఆయన కుడి కాలు, చెయ్యి విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. వాహన దారులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారని ఎస్సై వెంకట రవి తెలిపారు.

చిన్నారులను బడికి పంపాలి

కర్లపాలెం: చిన్నారులందరినీ బడికి పంపాలని కరుణా జీవన్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇనకొల్లు పోలీస్‌రావు చెప్పారు. కర్లపాలెం లంక కాలువ కట్టపై నివాసం ఉంటున్న గిరిజన కుటుంబాల్లోని చిన్నారులకు బుధవారం కరుణా జీవన్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పలకలు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈసందర్భంగా పోలీస్‌రావు మాట్లాడుతూ ప్రతినెలా మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పది మందికి చేయూతనిద్దాం చైతన్య పరుద్దాం అనే కార్యక్రమం ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కర్లపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం గార్లపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలు



కర్లపాలెం: నేత్ర వ్యాధులకు సకాలంలో వైద్యం చేయించుకోవాలని రేపల్లె ఫోకస్ కంటి హాస్పటల్ నేత్ర వైద్యులు కిషోర్ చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, రెడ్డి సేవా మిత్ర ట్రస్ట్ అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం కర్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్యవతీపేటలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో రేపల్లె ఫోకస్ కంటి హాస్పటల్ వైద్యుడు కిషోర్ 80మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. రెడ్డి సేవామిత్ర ట్రస్ట్ అధ్యక్షుడు నంగు గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ శిబిరానికి వచ్చిన వారిలో కళ్లజోళ్ల అవసరం ఉన్న వారికి ట్రస్ట్ తరపున కళ్లజోళ్ళు అందజేస్తున్నామని తెలిపారు. కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమైన వారిని రేపల్లెలోని ఫోకస్ హాస్పటల్‌లో ఉచితంగా ఆపరేషన్ చేస్తారని ఆయన వివరించారు. శిబిరంలో అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామస్తులు కేశవరెడ్డి, సాంబశివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, గోవర్ధనరెడ్డి తదితరులు ఉన్నారు.

నందివెలుగు జంక్షన్‌లో ఆక్రమణలు తొలగింపు



తెనాలిటౌన్: నందివెలుగు-తెనాలి ప్రధాన రహదారిపై నందివెలుగు జంక్షన్ చుట్టూరా ఉన్న ఆక్రమణలను బుధవారం పంచాయతీ అధికారులు తొలగించారు. ప్రధాన రహదారి చుట్టూరా చిరువ్యాపారులు, బండ్లు, టిఫెన్ సెంటర్లు ఇతర వ్యాపార లావాదేవీలు జరుపుతుండటంతో ఆ ప్రాంతం ట్రాఫిక్ రద్దీతో కిక్కిరిసిపోతుంది. స్థానిక శాసనసభ్యులు, మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ఎంపీడీవో అత్తోట దీప్తి ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులకు పురమాయించారు. దీంతో అధికారులు ఆక్రమణలను తొలగించి ఆప్రాంతాన్ని ఖాళీ చేయించారు.

అగ్నిమాపక అధికారి బాధ్యతల స్వీకారం

తెనాలిరూరల్: తెనాలి సహాయ జిల్లా అగ్నిమాపకాధికారిగా ఎస్. వేణుగోపాలరావు నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు నుండి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయన మంగళవారం ఉన్నతాధికారులను కలిశారు. గతంలో మాచర్ల, బాపట్ల, చిలకలూరిపేట, గుంటూరులో పని చేసిన ఆయన పదోన్నతిపై నెల్లూరు వెళ్లి, అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు.